క్లుప్తంగా

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కర్లపాలెం: వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు కర్లపాలెంలోని పెద్దింటమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్‌సీపీ బాపట్ల ఇన్‌చార్జి కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

కర్లపాలెం మండల కార్యదర్శుల సంఘం ఎన్నిక



కర్లపాలెం: కర్లపాలెం గ్రామ పంచాయతీల కార్యదర్శుల మండల సంఘం అధ్యక్షుడిగా కె.వీరాస్వామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు సమావేశమై మండల సంఘంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా దుండివారిపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి ఎన్నికవగా, ప్రధాన కార్యదర్శిగా దుండివారిపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే షాహీన్‌సుల్తానా, కోశాధికారిగా కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్.సునీత, సంఘం కార్యదర్శిగా బుద్దాం పంచాయతీ కార్యదర్శి బి.వీరేంద్ర, ఉపాధ్యక్షులుగా గణపవరం కార్యదర్శి పి.సాంబశివరావు, సమ్మెటవారిపాలెం కార్యదర్శి ఎం.సువర్చల, కొత్తనందాయపాలెం కార్యదర్శి ఎ.మురళీకృష్ణారెడ్డి, నర్రావారిపాలెం కార్యదర్శి ఎస్‌కే షమీర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు వీరాస్వామిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ



కర్లపాలెం: పశువులలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పశు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ తెనాలి డీడీ డాక్టర్ పద్మావతి తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం యాజలి, బుద్దాం గ్రామాలలో సుమారు 1,500 గొర్రెలకు, మేకలకు కర్లపాలెం పశు వైద్యాధికారి అన్సారీ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన డీడీ పద్మావతి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులు పసికిరి తినటం వలన సీజనల్‌గా వ్యాధులు వస్తాయని సకాలంలో పశువులకు వైద్యం చేయించాలని చెప్పారు. పశు వైద్యాధికారి అన్సారీ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న 20 గ్రామ పంచాయతీలలో పశువులకు నట్టల నివారణ మందు వేస్తామని తెలిపారు. ఎల్‌ఎస్ ఎ.రాజేష్, గోపాలమిత్ర శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



భట్టిప్రోలు (కొల్లూరు) : ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలోని పేటేరు– ఓలేరు ఎస్‌హెచ్ 216పై గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గొరికపూడి శివారు దాసరిపాలెంకు చెందిన గడ్డె విజయకుమార్ (22) రేపల్లెలో శీతలపానీయాలకు సంబంధించిన వ్యాన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శీతలపానీయాల రవాణా పూర్తయిన అనంతరం తన ద్విచక్ర వాహనంపై రేపల్లె నుంచి దాసరిపాలెం వెళుతున్న క్రమంలో ఎస్‌హెచ్ 216పై అదే మార్గంలో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. ప్రమాదంను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని వైద్య సేవల నిమిత్తం 108 వాహనంలో రేపల్లెకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్‌ఐ ఎం.శివయ్య పేర్కొన్నారు.

చోరీకి గురైన కెమెరాలు స్వాధీనం

తెనాలిరూరల్: పట్టణ గంగానమ్మపేటలో గత నెల 26న సుమారు రూ. 10 లక్షల విలువైన కెమెరాలు చోరీకి గురయ్యాయి. ఓ ఫోటో స్టూడియో తలుపుకు ఉన్న అదదం తొలగించి లోనికి ప్రవేశించిన దుండగులు కెమెరాలను అపహరించి తిరిగి అద్దాన్ని యథాస్థితిలో ఉంచారు. దీనిపై స్టూడియో నిర్వాహకుడు గారపాటి రఘు పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు నిందితులను గుర్తించి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. అలానే నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎప్పుడు తీస్తారో.. ఎప్పుడు ఇస్తారో..?!

- కరెంట్ కోతలతో గ్రామాల్లో ప్రజలు ఇక్కట్లు
- విద్యుత్ కోతలు లేకుండా చూడాలని వేడుకుంటున్న గ్రామస్తులు



విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం- వేమూరు

వేమూరు: గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ కోతలతో విద్యుత్ వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు. వేళాపాళా లేకుండా విద్యుత్ తీసివేయడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కరెంట్ కోతలను విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యుత్ వినియోదారులు చెబుతున్నారు. వేమూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 12,600 గృహ, వ్యాపార విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1,650 ఉన్నాయి. కరెంట్ ఎప్పుడు తీస్తారో..? ఎప్పుడు ఇస్తారో..? అర్థం కాని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రతి రోజు రాత్రి సమయంలో రోజుకు 5 నుంచి 7 సార్లు కరెంట్ తీస్తున్నారని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. వర్షాకాలం కావడంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉందని, కరెంట్ కోతలతో దోమల బెడద తట్టుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతలపై విద్యుత్ సబ్ స్టేషన్‌లో పని చేసే ఆపరేటర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ప్రజలు చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నారని, కనీసం రాత్రి సమయంలోనైనా కరెంట్ కోతలు లేకుండా చూడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామ సచివాలయంలో లైన్ మెన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో కరెంట్ సమస్య వస్తే వెంటనే పరిష్కారం చేయడం జరిగేది. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి కరెంట్ కోతల సమస్య నెలకొనలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మండలంలోని ప్రతి గ్రామంలో కరెంట్ కోతల సమస్య నెలకొంది. గ్రామ సచివాలయంలో లైన్ మెన్‌లను విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగించుకోవడంతో గ్రామాల్లో కరెంట్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, ప్రతి రోజు విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయిని గ్రామాల్లోని ప్రజలు చెబుతున్నారు. ఒక్కొక్కసారి ట్రాన్స్‌ఫార్మర్‌లు ట్రిప్ అవడం వల్ల కరెంట్ పోయి లేకపోతే లో ఓల్టేజి సమస్యలతో రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నామని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో ఇబ్బందులు



విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ వేళాపాళా లేకుండా తీయడంతో నానా బాధలు పడుతున్నాం. అధికారులు ఎలాంటి కోతలు లేకుండా కరెంట్ ఇవ్వాలి. కరెంట్ లేకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

– దున్నా మేరీసుబాబు, వేమూరు

కోతలు లేకుండా చూడాలి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల్లో విద్యుత్ కోతలు సమస్య నెలకొంది. విద్యుత్ అధికారులు గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి. ముఖ్యంగా రాత్రి జమయంలో కరెంట్ తీసివేయడంతో అవస్థలు పడుతున్నాం.

– గుమ్మడి దానియేలు, వేమూరు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె: రేపల్లె నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళికపై పట్టణంలోని ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపల్లె పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రేపల్లె కమ్యూనిటీ వైద్యశాలను నూరు పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తీరప్రాంతాన్ని అభివృద్ధి చేయటంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ సాంబశివరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నగరం మండలం సజ్జావారిపాలెం, నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామాలలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ కార్యక్రమంలో భాగంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడాది కూటమి పాలనపై ఆరా తీశారు. అనంతరం రేపల్లె పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను బడికి పంపడం తల్లిదండ్రుల కర్తవ్యం

ఎంఈవో–2 ఎస్.దేవరాజ్



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో-2 దేవరాజ్

భట్టిప్రోలు (కొల్లూరు) : చిన్నారులను పాఠశాల మాన్పించి ఇంటి వద్ద ఉంచుకోవడం, పనులకు పంపడం వంటి చర్యలకు పాల్పడకుండా తల్లిదండ్రులు తప్పనిసరిగా విద్యార్థులను బడికి పంపడం వారి కర్తవ్యంగా భావించాలని ఎంఈవో–2 ఎస్.దేవరాజ్ అన్నారు. గురువారం మండలంలోని ఐలవరంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బడి మానివేసిన పిల్లలను తిరిగి పాఠశాలకు రప్పించేందుకు ఎంఈవో నేతృత్వంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నలుగురు విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు రావడం లేదని గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. క్లస్టర్ హెచ్‌ఎం ఎం.మోహన్ రావు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మోటార్‌సైకిల్ మెకానిక్స్ దినోత్సవం



పట్టణంలో నిర్వహించిన మోటారుబైక్ ర్యాలీ

తెనాలి: ఆంధ్రాప్యారిస్ మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మోటార్ సైకిల్ మెకానిక్స్ దినోత్సవం నిర్వహించారు. స్థానిక వహాబ్‌చౌక్‌లో అసోసియేషన్ పతాకాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మోటార్‌బైక్ ర్యాలీని అడ్‌హాక్ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు జండా ఊపి ప్రారంభించారు తదుపరి అయితానగర్‌లోని నన్నపనేని సరస్వతి, సీతారామయ్య కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో సీనియర్ మెకానిక్‌లను సత్కరించారు. తెనాలిలోని అన్ని షోరూములు, మెకానిక్‌లు, అనుబంధ పనివారు, ఆటోమొబైల్ షాపుల వారు కార్యక్రమంలో మాట్లాడారు. అడ్‌హాక్ కమిటీ సభ్యుడు సంపత్ మాట్లాడుతూ ఎన్నో ఒడుదుడుకులున్న అందరం కలసి ప్రతి పనిని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పి.డేవిడ్, ఖాశిం, గోపి, రాము, రాజారెడ్డి, జానీ బాషా, ఇబ్రహీం, కరీముల్లా మాధవ, గౌసూ, నూరు మేస్త్రీ, బి.బోస్ మిస్త్రీ ప్రసంగించారు.

ప్రయాణికులతో జాగ్రత్తగా మెలగండి

- తెనాలి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హీరా సింగ్ సూచన
- రైల్వే స్టేషన్‌లో స్టాండ్ ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్పీఫ్ ఇన్‌స్పెక్టర్ హీరాసింగ్

తెనాలిరూరల్: ప్రయాణికులతో జాగ్రత్తగా మెలగాలని, అనుమతులను ప్రజా రవాణా వాహనాలను అడ్డుకో రాదని తెనాలి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హీరా సింగ్ ఆటో డ్రైవర్లకు చెప్పారు. తెనాలి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని ఆటో డ్రైవర్లకు గురువారం ఏఎస్‌ఐ ఎం. శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రాపిడో వంటి ఆథరైజ్ వాహనాలను అడ్డుకొని ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిన సందర్భం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరు డ్రైవర్ లైసెన్సు, ఆటోకు సంబంధించిన పత్రాలు ఎప్పుడు దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రయాణికులపై ఎలాంటి అనుమానం వచ్చినా, వారు తీసుకువెళ్లే లగేజీపై సందేహం ఉన్నా వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే విధానంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆటో స్టాండ్ ప్రాంగణంలో ఆటోల పార్కింగ్ విషయంలోనూ నిబంధనలు పాటించాలని, అనుమానితులను గుర్తిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యవసర సమయాలలో ఆర్పీఎఫ్, జీఆర్పీ హెల్ప్‌లైన్ నెంబర్లు 139, 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో హెడ్ కానిస్టేబుల్ కోటిరెడ్డి, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లవెంట కొబ్బరిబొండాలు వేస్తే కఠిన చర్యలు

ఇన్‌చార్జ్ కమిషనర్ వీ.ఎం.లక్ష్మీపతిరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిటౌన్: రోడ్ల వెంబడి, కాల్వల్లో కొబ్బరి బొండాలు పడవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొబ్బరి బొండాల వ్యాపారులతో ఆయన మాట్లాడారు. కొబ్బరి బొండాల వ్యర్థాలను ఇష్టరాజ్యంగా రోడ్ల వెంబడి కాల్వల్లో వేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయని తెలియజేశారు. ఇటీవల పారిశుధ్య నిర్వహణ కష్టతరమవుతుందని, వీటిలో నీరు నిల్వచేరి దోమల వ్యాప్తి అధికమవుతుందని వెల్లడించారు. తద్వారా అంటువ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాపారులు బొండాల వ్యర్థాలను రోడ్ల వెంబడి కాల్వల్లో పడవేయవద్దని సూచించారు. సొంత వాహనాల్లో తీసుకువెళ్ళి నిర్దేశించిన స్థలంలో వేయాలని కోరారు. వ్యాపారులు మాట్లాడుతూ ప్రతినెలా పన్ను చెల్లిస్తామని మున్సిపాలిటీ వాహనాలను ఏర్పాటు చేస్తే వ్యర్థాలను తరలించేందుకు తమకు వెసులుబాటుగా ఉంటుందని కోరగా ఆలోచించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో చైర్మన్ తాడిబోయిన రాధిక, హెల్త్ ఆఫీసర్ ఎం.యేసుబాబు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సిటీ ప్లాన్ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

బ్యాంక్ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఊహారాణి

చేబ్రోలు: బ్యాంక్ ఖాతాదారులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఖాతాదారుల చైతన్య, అవగాహన సదస్సు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఖచ్చితమైన లావాదేవీలు నడపాలని, డిఫాల్టర్‌గా ఉండకూడదని, సిబిల్ స్కోర్ కలిగి బ్యాంకు ద్వారా రుణాన్ని పొంది వ్యాపారాభివృద్ధి పొందాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎంపీడీవో టి.ఊహారాణి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి సంపాదనలో 20 శాతం పొదుపు చేయడం అనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు ముఖ్య ఉద్దేశ్యమని, దీనిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మహిళలు పొదుపు చేయడం ద్వారానే అభివృద్ధి సాధించగలరన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సర్వే ప్రకారం పురుషుల కంటే మహిళలు సంపాదనలో 84 శాతం పొదుపు చేస్తున్నారని అన్నారు. సూపరింటెండెంట్ ఏ.ఉమాదేవి, వెలుగు ఏపీఎం శ్రీలక్ష్మి, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, వెలుగు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయాల వద్ద వనమహోత్సవం

పండ్ల మొక్కలు నాటిక విజ్ఞాన్ వర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు



కొల్లిపర(తెనాలి): వన మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన కొల్లిపర మండలంలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచ్ ఏజీఎం ఎస్.శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ షేక్ బాజీబాబా, సూపర్‌వైజర్ టి.ప్రవీణ్ పర్యవేక్షణలో ముందుగా మండల కేంద్రమైన కొల్లిపరలోని సొసైటీ కార్యాలయం వద్ద విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు కొబ్బరి, ఉసిరి, మామిడి, సపోటా, సీతాఫలం వంటి పండ్ల మొక్కలను నాటారు. తదుపరి తూములూరు, అత్తోట గ్రామాల్లోని సొసైటీ కార్యాలయాల వద్ద కూడా మొక్కలను నాటారు. కార్యక్రమంలో సొసైటీల సీఈవోలు గుదిబండి శివనాగిరెడ్డి, ఆరుమళ్ల పూర్ణరెడ్డి, జి.విజయ భాస్కర్, శ్రేష్ట ఎఫ్‌పీసీ డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మలినేని మహిళా కళాశాల డైరెక్టర్ నియామకం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా డాక్టర్ కోమటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. స్థానిక కళాశాలలో బుధవారం నూతనంగా నియమితులైన డైరెక్టర్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మలినేని కళాశాలల చైర్మన్ పెరుమాళ్ల డైరెక్టర్ వెంకటేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కళాశాల విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణల్లో ముందుకు సాగేందుకు కోమటి అనుభవం ఒక దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. వెంకటేశ్వరరావు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పొందారని గుర్తు చేశారు. విద్యారంగంతో పాటు ఐటీ, ఇస్రో వంటి ప్రఖ్యాత ప్రభుత్వ సంస్థల్లో కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జెట్టి అప్పారావు, డీన్లు డా.పోపూరి రమేష్, ప్రొఫెసర్ జంపని కిషోర్ బాబు, ఇతర విభాగాధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

తెనాలిరూరల్: మహిళల భద్రత, సంక్షేమం కోసం ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ ఉండాలని వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ అధ్యక్షతన గురువారం రెవెన్యూ, వివిధ శాఖల ఉద్యోగులకు అవగాహన సదస్సు గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, కట్నం వేధింపులు, మహిళలపై లైంగిక, మానసిక, శారీరక వేధింపులకు సంబంధించిన పలు చట్టాలు, హెల్ప్ లైన్ సెంటర్ల వివరాలను వెల్లడించారు. అలానే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి కార్యాలయంలో మహిళల రక్షణ కోసం ఇంటర్నల్ కంట్రోల్ కమిటీ నలుగురు సభ్యులతో ఏర్పాటు కావాలన్నారు. సమావేశంలో సచివాలయాల ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సేవలే లక్ష్యం

- విద్యుత్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సిహెచ్.రమేష్
- రూ.30 లక్షల నిధులతో అభివృద్ధి పనులు



బుర్రిపాలెంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న రమేష్

తెనాలిటౌన్: జిల్లా వ్యాప్తంగా నిరంతరాయంగా వినియోగదారులకు విద్యుత్ సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్.రమేష్ పేర్కొన్నారు. గురువారం రూరల్ మండలం బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న పాత లైన్ల మరమ్మతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ సి.హెచ్.రమేష్ మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలోని బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామాలకు కలుగుతున్న విద్యుత్ అంతరాయాలను తగ్గించడం ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా 30 లక్షల నిధులను మంజూరు చేసి పాతలైన్లు సరిచేయడమేకాక 24 గంటలు నిరంతర విద్యుత్ అందించేందుకు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసినట్లు వెల్లడించారు. బుర్రిపాలెం సర్పంచ్ పెమ్మసానీ విజయలక్ష్మి, జయప్రకాష్ నారాయణ, చక్రాయపాలెం గ్రామస్తులు పరుచూరి చిన వీరయ్య, నరాలశెట్టి శ్రీనివాసరావులు ఎస్‌ఈ రమేష్‌ను కలిసి విద్యుత్ సమస్యలు వివరించారు. వారి వినతిని నమోదు చేసుకుని సూచనలు తప్పక పరిగణలోకి తీసుకుంటామని, త్వరితగతిన విద్యుత్ సమస్యను అధిగమిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా కన్‌స్ట్రక్షన్ డీఈఈ ఉదయ్, తెనాలి టౌన్ డీఈఈ బోరుగడ్డ ఆశోక్ కుమార్, డీ 3 సెక్షన్ ఏఈ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు రైతులు తరలిరండి



మాట్లాడుతున్న శివ సాంబిరెడ్డి

కొల్లిపర: పెట్టుబడిదారులు ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం రైతులు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ 100 సంవత్సరాలు క్రితం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈరోజు బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మిక వర్గం సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వ రంగ సంస్థల కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దీని ఫలితంగా కోట్లాది మంది ప్రజల కష్టార్జితాన్ని కొద్దిమంది కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా రైతు కవులు రైతు వ్యవసాయ కార్మికులు కూడా ఈ సమ్మెకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు తుంగ బాలస్వామి మాట్లాడుతూ మండలంలో గల అంగన్వాడీ ఆశ పంచాయతీ కార్మికులు మధ్యాహ్న భోజన కార్మికులను స్కీం వర్కర్లుగా గుర్తించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖర రావు మాట్లాడుతూ స్కీం వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం 26000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల తొమ్మిదో తేదీన కొల్లిపర అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కార్మిక ప్రదర్శనలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

చేబ్రోలు: ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది భవిష్యత్‌ను మలచే సాధనం మాత్రమే కాదని.. నేటి అవసరంగా మారిపోయిందని ఏపీ ఎస్ఎస్‌డీసీ మాజీ సీఈవో, ఎండీ గంటా సుబ్బారావు అన్నారు. విద్యార్థులు ఏ విభాగంలో ఉన్నా ఏఐపై అవగాహన పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ఏఐ–ఫోకస్డ్ యూనివర్సిటీ' అనే అంశంపై యూనివర్సిటీలోని ఆయా విభాగాల డీన్స్, డైరక్టర్స్, విభాగాధిపతులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలే కాదు.. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, న్యాయ వ్యవస్థ, ప్రజాసేవ వంటి అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందన్నారు. ఐఐటీ మద్రాస్ పూర్వ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎస్.శివ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యా, పరిశోధన, పరిశ్రమల మధ్య గల వ్యత్యాసాలను తగ్గించడానికి యూనివర్సిటీల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐతో కలిసి క్వాంటం టెక్నాలజీస్ విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.